బహువ్రీహి

1

"రేపురా! మాపురా! అని ఇంకా ఎన్నిసారులు తిప్పుతారండీ!"

అని గర్జించి అడిగాడు విద్యానాథుడు.

"ఏం జెయ్యను బాబూ! బేతాళ నాయనింగారు పరబ్రహ్మ వచ్చినా మరి ప్రభు దర్శనం వల్లపడదంటున్నారు! నావల్ల ఏమవుతుంది?"

కొంచెం సర్ది చెప్పాడు సోమయామాత్యుడు.

"ఇన్ని సార్లు తిప్పి చిట్టచివరికిలాగేనా సన్నాయి నొక్కులు నొక్కడం? ఏమన్న పెద్దమనిషివయ్యా! ఆమాట మొట్టమొదటే ఏడవలేకపోయావూ? నే నేదో మరో దారి చూచుకుందునుగా!"

అని ఈసడించి కసిరి కొట్టాడు విద్యానాథుడు.

"మాటలు మాత్రం తిన్నగా రానీ! ఏమిటి నువ్వు చూసుకునేది? గోదారి!" అని గుడ్లెర్ర జేశాడు సోమయామాత్యుడు.

"అదిగో! ఆ ఏకవచన ప్రయోగం చేశావంటే చూడు నిన్నేం జేస్తానో!"

"ఏమిటయ్యా! నువ్వు చేసేది? ప్రభుదర్శనార్థం వచ్చి పడిగాపులు పడి ఉండవలసిన మనిషి కింత తలపొగరా?"

అని రాసీ రాసీ గంటం అక్కడపెట్టి లేచి నిలబడ్డాడు సోమయామాత్యుడు. వెంటనే విద్యానాథుడతని మీదికి వెళ్ళి విరుచుకుపడ్డాడు.

ఆ పైన విద్యానాథుడు, సోమయామాత్యుడు ఒకరొకరితో గట్టిగా తలపడేదాకా వచ్చింది కాని ఆ పక్కనే కూర్చున్న నలుగు రైదుగురు విశ్వేశ్వరాగ్రహారీకులు ఆ ఇద్దరినీ చెరిఒక పక్కకి నెట్టి వేశారు. ఎవరికి సర్దిచెప్పవలసినట్లు వారికి సర్దిచెప్పారు. ఆ ఇద్దరూ మళ్ళీ రోషాలు పెంచుకుని ఒకరితో ఒకరు తలపడకుండా ఇద్దరిద్దరు చొప్పున వారిద్దరి జబ్బలూ గట్టిగా పట్టుకొన్నారు! అయినా వారిద్దరూ పెనగు లాడడం మానలేదు. సోమయామాత్యుడు మరి విద్యానాథునివైపు చూడడం మానివేసి పక్కనున్నవారికేసి చూస్తూ మండిపడ్డాడు.

"మహారాజ దర్శనం అంటే మాటలా? ఇంతకంటె కొమ్ములు తిరిగిన వాళ్లే కాళ్ళా వేళ్ళా పడితే చివరకు బేతాళనాయనింగారి దర్శనం కూడా కాలేదు. ప్రతి పంచాంగ బ్రాహ్మడికీ మహారాజ దర్శనమేనా?"

"ఇదిగో! కాస్త పెద్దా పిన్నా తారతమ్యం చూసుకుని మరీ మాట్లాడు! లేకపోతే నిన్నూ, ఆ బేతాళ నాయణ్ణి చెరోజబ్బ దొరక బుచ్చుకుని గోదావరిలోకి విసిరివేస్తాను! ఆ తరవాత నేనే స్వయంగా మహారాజదర్శనానికి వెళ్ళిపోతాను! నన్నెవరడ్డగిస్తారో చూస్తానుగా!"

సోమయామాత్యుడు మళ్ళీ ఉగ్రుడైపోయాడు. పక్కనున్న ఇద్దరగ్రహారీకులు అతన్ని మరింత గట్టిగా అదిమి పట్టుకున్నారు.

"నిన్ను మహారాజులుంగారి స్కంధావారం దరిమానానాకికూడా చేరనివ్వను! ఏమనుకున్నావో, సోమయామాత్యుడంటే! చూడు నా తడాఖా!"

"నీలాంటి అప్రాచ్యుల్ని, అశక్త దుర్జనుల్ని చాలామందినే చూశానులే! నువ్విలాంటి గోముఖవ్యాఘ్రానివని నేను మొదటే అను మానించాను. ఈ పైన నువ్వు చేసేదేమిటో నేను చూస్తానుగా!"

కన్నుమూసి కన్ను తెరిచేలోగా విద్యానాథుడక్కడినించి వెళ్ళి పోయాడు.

సోమయాజామాత్యుని వీథిచావడిలో ఒక్కమారుగా వాన కురిసి వెలిసినట్లయింది.

అమాత్యుడు కింద ఉంచిన గంటం మళ్ళీ చేతబట్టి తల ఎత్తకుండా ఎంతో గుంభనగా కవిలె కట్టలు తిరగవెయ్యడం మొదలు పెట్టారు. చుట్టూ కూర్చున్నవారిలో వెంకటభట్టే మొట్టమొదటగా పరిసంగం ప్రారంభించాడు :

"ఎందు కాయన కంతటి మిడిసిపాటు? కా స్త ఎదటివారి అంతరం, తన అంతరం చూసుకో అక్కరలేదూ ?......ఇంతకీ ఎవరండీ ఈ విద్యానాథుడు?"

"ఏమో ! ఎవడో ! ఎవడైతే మనకేం ?" అన్నాడు సోమయాజా మాత్యుడు.

"పాపం ! మనిషి యోగ్యుడేనండీ ! ఎందు కిలా తొందరపడ్డాడో గాని !" అన్నాడు పేరిభట్టు.

"మీరు గాని ఈయన్ని ఇంతకుపూర్వం ఎక్కడైనా చూచారా?" అన్నాడు సోమయాజామాత్యుడు రాసీరాసీ గంటం నిలబెట్టి.

"చూడడ మేమిటి? ఆయన్ని బాగానే ఎరుగుదును. ఆయనది మా మామగారి గ్రామమే. షట్శాస్త్రిలలోనూ నికరమైన పాండి త్యం కలిగినటువంటి మహా విద్వాంసుడు. ఆపైన దేవతావాణిలో అనర్గళంగా ఆశువు చెప్పగలిగినటువంటి మహా కవీశ్వరుడు కూడాను... అయితేమాత్రం అన్నప్పుడు ప్రభుదర్శనందొరకడమంటే మాటలుటండీ?"

అని సోమయాజామాత్యుణ్ణి కొంతవరకు సమరిస్తూ తన ప్రసంగం చప్పరించేశాడు. అమాత్యుని కీ ప్రసంగంతో కొంచెం ఊపిరి తిరిగింది.

"మొట్టమొదట దర్శనం సాధ్యపడుతుందేమోననే ధైర్యంతో కొంచెం మాట ఇచ్చాననే అనుకోండి. అయితే అంత మాత్రంచేత నలుగురిలోనూ పెద్దా పిన్నా తారతమ్యం చూడకుండా అలా దులిపి వేస్తాడా ?"

ఆపైన పేరిభట్టు వ్యంగ్యంగా ఒక చిరునవ్వు విసిరాడు :

"అలా దులిపివెయ్యడం తప్పేననుకోండి. కార్యవాది కంతటి దురుసుతనం పనికిరాదు. కాని, మీరు గట్టిగా తలుచుకుంటే ఆయన కామాత్రం దర్శనం దొరకకపోతుంది గనకనా ? ఎందుచేతనో మీకే అలాంటి సత్సంకల్పం కలిగినట్టు కనబడదు."

"ఎందుకు కలగాలీ! ఈయన మొదటినుంచి ఇదేవరస! తానేదో మహావిద్వాంసు డైతేమాత్రం ! ఎదటివాళ్లైనా పురుగు లను కున్నాడా ?"

"పాపం! రేపురా, మాపురా అని తిప్పితే, మరి దర్శనం కాదని కంగారుపడి ఉంటాడు. ఇంతకీ మహారాజులుంగా రిక్కడ ఇంకా ఎన్నాళ్ళుంటారో!"

"ఇంకా ఎన్నాళ్లేమిటి? ఎల్లుండి ఉదయమే గోదావరిదాటి వెళ్ళిపోతూం లేనే!"

అని సోమయామాత్యుడు మళ్ళీ కవిలెకట్టలు తిరగవెయ్యడం మొదలుపెట్టాడు. చుట్టూరా కూర్చున్నవారంతా అది చూచి చల్ల చల్లగా తమ ఇళ్ళకు జారుకున్నారు.

2

విశ్వేశ్వరాగ్రహారానికి విద్యానాథుడు కొండంత ఆశతో వచ్చాడు. ప్రత్యేకంగా అత డక్కడికి రావడాని కొక ముఖ్యకారణం ఉంది.

ప్రతాపరుద్రదేవమహీపతి గోదావరికి అవ్వలి ఒడ్డున బలిసిన సాంద్రారణ్యంలో వేటాడనున్నాడన్న వార్త కర్ణాకర్ణిగా అతని చెవిని పడింది. ఆ అగ్రహారం గోదావరీతీరాన్ని ఆనుకునేఉంది. వేట బల గంతో గోదావరి దాటేముందు మహారాజు విశ్వేశ్వరాగ్రహారంలో రెండు మూడు రోజులపాటు విడిదిచెయ్యడం ఒక పరిపాటి. విద్యా నాథుడు ముందుగానే ఆ విషయం తెలుసుకున్నాడు.

ఎలాగైనా మహారాజుదర్శనం చేసుకోవాలని సంకల్పించాడు. ఆ సంగతి ముందుగా సోమయామాత్యునితో ప్రస్తావించాడు:

"దానికేమిటి? మహారాజు బహు సులభులు! అందులోనూ మృగయావినోదం సందర్భంలో విద్వద్గోష్ఠి అంటే వారు చెవి కోసుకుంటారు. ఏదో సమయంచూచి నేను దర్శనం ఇప్పించే ఏర్పాటు చేయిస్తానులెండి!" అని అమాత్యుడు విద్యానాథునికి భరవసా ఇచ్చాడు.

కాని మహారాజు అగ్రహారంలో విడిది చెయ్యవలెనని నిర్ణయించుకొన్న మూడు రోజులలోనూ రెండు రోజు లప్పుడే గడిచిపోయాయి. అగ్రహారంలోని నలుగురైదుగురు విద్వాంసుల కప్పుడే అనాయాసంగా రాజదర్శనం లభించింది. కాని విద్యానాథునికి మాత్రం దర్శనం దొరకలేదు. అమాత్యునితో ఎన్నిసారులు చెప్పినా 'అదిగో ఇదిగో' అని కాలక్షేపం చేశాడు. ఇక ఇంకొక్కరోజే మిగిలిఉన్నదనగా విద్యానాథుడు మేల్కొన్నాడు.

అయితే తలవని తలంపుగా ఇప్పు డతనికీ, సోమయామాత్యునికీ మధ్య పెద్ద బదవిరోధం ఏర్పడింది. తనమీద అమాత్యుని కంతటి ఉపేక్షాభావం కలగడానికి గల కారణమేమో విద్యానాథునికి తెలియలేదు. మొట్టమొదట సోమయామాత్యునితో ఆ విషయం సంప్రతించినప్పు డతడు కొంచెం సుముఖంగానే ఉన్నాడు. తరవాత తరవాత అంటీ అంటనట్టుగా మాట్లాడడం మొదలుపెట్టాడు. ఓర్వలేనితనంవల్ల అగ్రహార విద్వాంసు లెవరయినా దర్శనం కాకుండా చేయించవలసిందని చెవి కొరికారేమో! లేకపోతే సోమయామాత్యునికి ముట్టవలసిన మామూళ్లేమైనా ముట్టలేదని అక్కసు బయలుదేరిందేమో! ఎవరు చెప్పగలరు!

ఆలోచించగా ఆలోచించగా విద్యానాథునికి దర్శనం దొరకకపోవడానికి రెండింటిలోనూ ఏదోఒకటి ప్రబలకారణమై ఉండవచ్చునని తోచింది. అతనిదగ్గరఉన్న నాలుగు వరహాలూ దారి బత్తెంకిందే హరించుకుపోయాయి. అదీగాక తనవంటి మహా విద్వాంసుడు, కవి దర్శనానికి వచ్చినా ఈ మామూళ్ళగోలేనా? ఏమి టీ దౌర్జన్యం?

ఆ విధమైన ఆవేశంతో అతని హృదయం కుతకుతలాడిపోయింది. ఇక ఒకరోజులో ప్రతాపరుద్ర మహీపతి అగ్రహారంలో వేయించిన

తన స్కంధావారం యావత్తూ ఎత్తివేయించి వేటబలగంతో సహా గోదావరిదాటి వెళ్ళిపోతున్నాడు. ఆయన మళ్ళీ తిరిగి వచ్చేసరికి ఇంచుమించు ఒక పక్షంరోజులు పట్టవచ్చు. తిరిగి వచ్చేటప్పు డాయన తొందర తొందరగా ఓరుగల్లు వెళ్ళిపోవచ్చు! ఇప్పుడు కాని దర్శనం ఇక ఎప్పుడో అవుతుందనే నమ్మకంమాత్రం ఏమి ఉంది!

అతనికి విశ్వేశ్వరాగ్రహార ప్రాంతం అంతా కొత్త. అక్కడి వారి నెవరినీ ఎరగడు. ఇక ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. ఒక మారు బేతాళనాయణ్ణి సందర్శించి ఆయనతో తనకు జరిగిన అన్యాయం అంతా పూసగుచ్చినట్టు చెప్పి తిరిగి న్యాయం జరిగించవలసిందని కోరాలని సంకల్పించాడు. బేతాళనాయని దర్శనమైనా దొరుకుతుందో దొరకదో! అయినా అధైర్యపడక శిష్యుడు భీమేశ్వరశర్మను పిలిచి ఆ విషయం మెలుకువగా తెలుసుకు రావలసిందని పంపించాడు. అతడు తిరిగి వచ్చేవరకు అర్ధరాత్రిదాకా అలాగే మేలుకుని కూర్చున్నాడు.

అర్ధరాత్రివేళ భీమేశ్వరశర్మ తిరిగి వచ్చాడు. అత డింకా సమీపానికి రాకుండానే విద్యానాథు డతణ్ణి ప్రశ్నించాడు:

"ఏమిటి బాబూ! ఏం జరిగింది?"

"జరగడానికేముంది? బేతాళ నాయునింగారు షష్టి గడియలూ మహారాజ సన్నిధినే ఉండిపోతున్నారట! రాజదర్శనమైనా దొరక వచ్చునుగాని బేతాళనాయనింగారి దర్శనం దొరకదంటున్నారు."

"అంతేనా?"

"అంతేనండి!"

"ఆ కరణం ఏమంటున్నాడోయ్?"

"సోమయామాత్యుని మాటేనా మీరనేది? తన అనుమతిలేనిదే బేతాళనాయనిం గారి దర్శనానికికూడా ఎవ్వరినీ పోనివ్వడంలేదు! ప్రత్యేకంగా అత డలా మనమీద కత్తుకట్టినపు డిక మనమేం చెయ్యగలం?"

"ఒరే, అబ్బాయీ! అనవసరంగా బెంబేలుపడి దిగులుపడిపోకు! ఇంతదూరం వచ్చి వట్టి చేతులతో తిరిగిపోతామా?"

"మీ రేదైనా సాహసానికి దిగితేమాత్రం వ్యవహారం ప్రతిఘటించి రాగాన పడుతుంది. కొంచెం జాగ్రత్తగా ఆలోచించండి!"

"సరేగాని, ఆ స్కంధావారం ఇక్కడికి ఎంత దూరం?"

"ఎంతో నా? కూతవేటుదూరం కంటె ఎక్కువ ఉండదు."

"గుడారానికి చుట్టూ పహరావాళ్ళున్నారా?"

"ఏదో ఉన్నా రక్కడక్కడ."

"ద్వారంలోనో!"

"చాలామందే ఉన్నారు" అని భీమేశ్వర శర్మ నెమ్మదిగా ఆవలించి ఒక చిటిక వేశాడు.

"పాపం! నీకు నిద్ర వస్తూందిలా ఉంది. పోయి పడుకో!"

"మీ రొక్కరూ అలా ఏకాకిగా కూర్చుని మథన పడుతూంటే నాకు మాత్రం కునుకు పట్టుతుందా!" అన్నాడు భీమేశ్వర శర్మ.

"కాదు! కాదు! నేనూ, నువ్వూ మళ్ళీ బాగా తెల్లవారు జామునే లేవాలి. వెళ్ళి పడుకో!"

విద్యానాథు డలా ఎందుకన్నాడో భీమేశ్వర శర్మకు తెలియలేదు. అడగడానికి ధైర్యం చాలక, అడగకుండా వెళ్ళిపోవడానికి కాళ్ళురాక అలాగే నిలబడిపోయాడు.

"ఇదిగో! నేను వస్తున్నానులే! నువ్వు పోయి పడుకో!"

విద్యానాథు డతనిని పంపించి వేశాడు. అలాగే కూర్చుని ఏదో తీవ్రాలోచనలో పడ్డాడు. కొంత సేపటి కతని కేదో స్ఫురించింది. ఆ స్ఫురణలో అతని పెదవిపై మల్లెపువ్వంత చిరునవ్వొక్కమారుగా తళుక్కుమని మెరిసింది!

3

విశ్వేశ్వరాగ్రహారం అంతా గాఢనిద్రలో మాటు మణిగింది. కార్తీకమాసం పొగమంచు అగ్రహారం మీద తెల్లని వెన్నెలలో పరుచుకుంది. కాని అప్పుడే చంద్రాస్తమయం అయింది. క్రిమ

క్రమంగా చీకటి నాలుగు మూలలా ఆవరించుకుంది. మరి కొంతసేప టికి కొక్కొరోకో! కో! అని కోడి కూత వినిపించింది.

ప్రతాపరుద్ర మహీపతి స్కంధావారంలోని వంది మాగధు లా సూచన విని మేలుకొలుపులు ప్రారంభించారు. వారి గొంతులతో ఇంకా మరికొన్ని 'కొక్కొరోకో' సవ్వడులు బాగా శ్రుతికలిపాయి. అలా ఒక గడియ గడిచిపోగానే వందిమాగధుల కైవారా లాగిపోయాయి. కాని స్కంధావారంలో అక్కడక్కడ పేటకుక్కల అరుపులూ, పరి చారకు లటూ ఇటూ మసులుతున్న సందడీమాత్రం మందగించ లేదు.

ప్రతాపరుద్ర మహారాజు మేలుకొని స్వయంభూదేవస్తుతి పఠిస్తూ నెమ్మదిగా నాలుగువైపులా పరికించి చూశాడు. శయ్యాగార ద్వారంలో పరిచారకులు దోసిళులొగ్గి నిలుచున్నారు. తిరిగి స్కంధావారం కొంత వరకు సద్దుమణిగింది.

అంతలోనే మేఘ గంభీర స్వరంతో ఒక శ్లోకం వినిపించింది. ఒకే గంభీరస్వరంతో వినిపించినా ఆ స్వరంలో రెండు గొంతు లేకీభ వించినట్లు స్ఫురించింది. మొట్టమొదట ప్రతాపరుద్రదేవుని కా శ్లోకం స్పష్టంగా వినిపించ లేదు. కాని ఆశ్లోకం మళ్ళీ మళ్ళీ మారుమోగింది. దానితో అది సుస్పష్టంగా అతని శ్రుతి కుహరంలో ప్రతిధ్వనించింది.

"నవలక్ష ధనుర్ధరాధినాథే
పృథివీం శాసతి వీరరుద్రదేవే
అభవత్పర మగ్రహార పీడా—"

"నవలక్ష ధనుర్ధరులకు అధినాయకు లైనటువంటి వీరప్రతాపరుద్ర దేవ మహీపతి పృథివీ పరిపాలన చేస్తూఉండగానే, అగ్రహారాలకు వల్లమాలిన పీడ కలిగింది."

ఇదీ ఆ శ్లోక తాత్పర్యం! ఆ శ్లోకం వినీవినగానే మహారాజు నిలువునా నీరయిపోయాడు! తన ధర్మపరిపాలనలోనే అగ్రహారపీడా? బ్రాహ్మణాగ్రహారాల కనేక మాన్యా లిచ్చి విద్వత్పోషకుడని బిరుదు వహించిన తన రాజ్యంలోనే అగ్రహారపీడా? ఇదేమిటి దురన్యాయం?

మహారాజెంతో విచారించాడు. తన దండనాయకులవల్లనో, లేక ఇంకా ఇతర అధికారులవల్లనో విశ్వేశ్వరాగ్రహారీకుల కెవరికో ఏదో అన్యాయం జరిగి ఉండవచ్చుననీ, అందువల్లనే వా రెవరో ఆ విధంగా ఆక్రోశిస్తూ ఉండవచ్చుననీ అనుకొన్నాడు. వెంటనే నిలుచున్న పాటుగా బేతాళనాయనింగారిని పిలిపించవలసిందని ఆజ్ఞాపించాడు. బేతాళనాయ డక్కడికివచ్చి చేతులు జోడించి సవినయంగా చక్రవర్తి కట్టెదుట నిలబడ్డాడు. మహారాజు వెంటనే ఆ మొర విషయం విచారించవలసిందనీ, ఆ మొరపెట్టేవారిని తన ఎదుట నిలబెట్టవలసిందనీ ఆజ్ఞాపించాడు. సరిగా అదే సమయంలో మళ్ళీ ఆ ఆక్రోశం విన బడింది. వెంటనే బేతాళనాయకు డక్కడనించి నిష్క్రమించాడు.

మహారాజు తిరిగి కొంతసేపు విశ్రమించాడు. తెల్లవారేసరికి స్కంధావారంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కొలువుకూటంలో క్రమంగా బేతాళనాయకుడూ, అతని వెనక వెనక ఒదిగిపోతూ చేతులు కట్టుకుని నిలబడిన సోమయామాత్యుడూ ప్రవేశించారు. మరికొంత సేప టికి విద్యానాథుడు కూడా శిష్యుడు భీమేశ్వర శర్మను వెంటబెట్టుకుని అక్కడికి వచ్చాడు.

ప్రతాపరుద్రు డక్కడికి విచ్చేయడంతో అందరూ సవినయంగా తలలు వంచి ప్రత్యుత్థాన మర్యాదలు నడిపించారు. మహారాజు కాక సుఖాసనం మీద కూర్చుండి కొంచెం విశ్రమించిన తరవాత బేతాళ నాయకుడు సవినయంగా విజ్ఞప్తి చేశాడు :

"ఏలినవారి కీవిధంగా మనస్తాపం కలిగించినవార మైనామే అని మేమంతా చాలా నొచ్చుకుంటున్నాము. ఇంతకీ ఏమి జరిగిందంటే త్రిలింగదేశం అంతటా పేరుమోసిన విద్యానాథ విద్వాంసులు తమ దర్శనార్థమై విచ్చేసినప్పుడు మన అగ్రహారం కరణం సోమయామాత్యులు వారి విద్వత్తు ఎంతటిదో తెలుసుకోలేక కొంచెం కించపరిచారట. కావడాని కది గొప్ప విద్వదపచారమే! అయితే కవిలె కట్టలు కట్టుకునే కరణాలకు విద్వత్తుగొడవ లేం తెలుస్తాయి? తమరికి శ్రమ కలిగించవలసి వస్తుందనే భయంచేతనే అమాత్యు లావిధంగా చేశారట! అపరాధం మన్నించవలసిందని వారు విన్నవించుకొంటున్నారు." అని బేతాళ

నాయకుడు సోమయామాత్యుణ్ని సమర్థించీసమర్థించనట్లుగా సమ ర్థించాడు.

మహారాజు దృష్టి అలవోకగా ఒకమారు సోమయామాత్యునివైపు తిరిగింది. అమాత్యుడు తలవంచుకున్నాడు.

“మహాప్రభూ! విద్యానాథుల విద్వత్తెంతటిదో తెలియక నేను వారి యెడల అపచారం చేసినమాట నిజమే! అయితే వినోద సమయంలో తమ కనవసరంగా శ్రమ కలుగుతుందనే సంకోచం వల్లనే నేనలా వ్యవహరించాను.”

విద్యానాథు డిదంతా ఒక కంట కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు. బేతాళ నాయకుడు నిందంతా నెమ్మదిగా తనమీద తోసివేస్తున్నాడని ఆకళించుకొన్నాడు. ప్రతాపరుద్రుని వైపు తిరిగి ఏదో విన్నవించ బోయాడు. అది కనిపెట్టి బేతాళ నాయకు డడ్డుపడ్డాడు :

“మన సోమయామాత్య లేదో తెలియక తప్పు చేశారనే అను కుందాము. అయితే విద్యానాథ విద్వాంసు లంతటివారు తొందరపడి తమ ధర్మ పరిపాలన కంతటికీ కళంకం ఆపాదిస్తూ ఆ విధంగా, విద్వ ల్లోకంలో శాశ్వతంగా నిలిచిపోయే శ్లోకం రచించడం మాత్రం భావ్యం కాదేమో అనిపించింది. ఆ పైన తమ చిత్తం!”

అతి వినయంగా చేతులు కట్టుకుని బేతాళ నాయకుడు నిలబడ్డాడు. దానితో విద్యానాథుని కిక నోరు తిరగలేదు. సోమయామాత్యుడు, బేతాళ నాయుడు కలిసి చివరి కిదంతా తన మీదికి తీసుకువచ్చారని గ్రహించుకొన్నాడు. దర్శనం ఇప్పించకపోవడం అపరాధమే అని వారంతట వారే అంగీకరించినప్పు డిక ప్రత్యేకంగా వారిని నిందించ వలసింది ఏమి ఉంది? ఒక్క నిమిషం ఆలోచించి అతి గుంభనగా ఒక చిరునవ్వు నవ్వాడు :

“మహాప్రభూ! ఎంత శ్రమపడినా తమ దర్శనం కాలేదే అనే కించకొద్దీ తెల్లవారుజామున నేనూ, నా శిష్యుడూ కలిసి ఆ శ్లోకం అంత గంభీరంగా పఠించాము. అయితే అదంతా అసంపూర్తి శ్లోకమే! శ్లోకం అంతా పూర్తిగా చదివితే దానిలో తమ కీర్తి ప్రశంసే గాని

అపకీర్తి ప్రస్తావన ఆవంతయినాలేదు! బేతాళనాయనింగా రనవసరంగా నా మీద నింద మోపుతున్నారు! అంతే!''

''అయితే ఆ శ్లోకంలో అగ్రహార పీడ ప్రస్తావనే లేదా?''

అన్నాడు మహారాజెంతో ఆశ్చర్యపడి.

''ఇదిగో! ఆ శ్లోకం అంతా చదువుతున్నాను. ఆలకించండి!''

అని విద్యానాథుడా శ్లోకం అంతా పూర్తిగా చదివాడు:

''నవలక్షధనుర్ధరాధినాథే
పృథివీం శాసతి వీరరుద్రదేవే,
అభవత్పర మగ్రహార పీడా
కుచకుంభేషు కురంగలోచనానామ్''

ఆఖరి పాదం చేర్చి చదవడంతో ఆ శ్లోకం అర్థం అంతా తారుమారైపోయింది.

''వీరప్రతాపరుద్ర మహీపతి పృథివి పరిపాలిస్తూండగా కురంగలోచనలైన అంగనల కుచకుంభములమీది అగ్ర - హారాలకు—అంటే ముందున్న ముత్యాల హారాలకు పీడనం కలిగింది.''

అని మాత్రమే అర్థం వచ్చింది. ఆ చమత్కారం గ్రహించిన మహారాజు విద్యానాథుని కవితాశక్తికి ఆనందించి అతన్ని అనేక విధాల ప్రశంసించాడు. చివరికి బేతాళనాయనికీ, సోమయామాత్యునికీ కూడా ఆ కొత్త అర్థం బాగున్నదనక తప్పలేదు. ఇక చేసేదేమీ లేక వారు కూడా విద్యానాథుని పాండిత్యప్రశంస ప్రారంభించారు. మహారాజు విద్యానాథున కింకా ఎన్నో బహూకృతు లందించాడు! ''విద్యానాథ విద్వాంసులకు విశ్వేశ్వరాగ్రహారంలో సస్యశ్యామలమైన పది పుట్ల సుక్షేత్ర ఖండిక సర్వకర పరిహారంగా ధారాదత్తం చెయ్యవలెనని నిశ్చయించాము.'' అని బేతాళనాయకునివైపు చూచాడు. నాయడు సోమయామాత్యునివైపు చూచాడు. సోమయామాత్యుడు తడుముకోకుండా వెంటనే సమాధానం చెప్పాడు:

"మహాప్రభూ! అగ్రహారంలో మన కోటాకో తర భాగంలో ఉండుకున్న పది పుట్లభూమి సాక్షాత్తూ బంగారంపండే సుక్షేత్రఖండిక!" అన్నాడు.

"అయితే రేపుదయం అదే వారికి ధారాదత్తం చేస్తున్నాము."

అని మహారాజు విద్యానాథుని కెంతో ఆదరంగా వీడ్కోలిచ్చి పంపివేశాడు. ఆ సమయంలో బేతాళనాయడూ, సోమయామాత్యుడూ ఒకరి మొహాలొకరు చూచుకుని చిరునవ్వులు నవ్వుకున్నారు. ఆ మరు నాటి ఉదయమే ప్రతాపరుద్రుడు విద్యానాథుని కా భూమి అంతా ధారాదత్తంచేసి వేటబలగంతో సహా గోదావరిదాటి వెళ్లిపోయాడు.

4

మహారాజు చేసిన ఆ అఖండ సత్కారానికి విద్యానాథు డెంతో ఆనందించాడు. "త్రిలింగ ప్రభువుల విద్యాదరణ ఈ నాటిదా?" అని కాకతీయ మహారాజుల వదాన్యత ఆకాశానికే ఎత్తివేశాడు.

మహారాజు గోదావరిదాటి వెళ్ళిపోయిన మరునాడు తనకు ధారా దత్తంచేసిన సుక్షేత్రఖండిక అంతా ఒక్కమారు కళ్ళారా చూచుకోవా లని ఉబలాటపడ్డాడు. శిష్యుడు భీమేశ్వర శర్మతో కలిసి అక్కడికి వెళ్ళాడు.

అది ఆకాశమంత చెరువు. అప్పుడప్పుడే వికసించిన తామర పూవులతో కలకలలాడుతూ వేయి చేతులతో ఆహ్వానిస్తున్నట్లు కనిపించింది.

విద్యానాథుడు ఎంతో సంతోషంతో చెరువుగట్టెక్కి దానికి ఉత్తరదిక్కుగా ఉన్న తన భూభాగం అంతా జాగ్రత్తగా పరిశీ లించాడు. ఆ ప్రదేశం అంతా చూడగానే అతని నవనాడులూ కుంగి పోయాయి! అతని కెదురుగా కనిపించిన పదిపుట్లభూమి చాలావరకు వట్టి చవిటిపర్ర!

అది చూడగానే అతనికి సోమయామాత్యుడు చేసిన ద్రోహం అంతా కళ్ళకు కట్టినట్టెదురుగా ప్రత్యక్షమైంది! ఎక్కడో రెండు

మూడెకరాలలో మాత్రం కొంచెం మెట్ట వ్యవసాయం సాగుతూంది. అంతే! మళ్ళీ దక్షిణంగా తిరిగిచూచాడు.

తటాకానికి దక్షిణదిశగా కనిపించిన పదిపుట్లభూమి నిజంగా బంగారు పండే సుక్షేత్రఖండికే! ఆ భూమి చూడగానే విద్యానాథుని కళ్ళల్లో వేడి కన్నీరంతా ఆవిరిగా మారిపోయింది.

"సోమయామాత్యుడు నా కొంప నిలువునా తవ్వేశాడు! అలాంటి గోముఖవ్యాఘ్రంతో పెట్టుకున్న బలవద్విరోధంవల్లే నా కింతటి దుర్గతి పట్టింది."

అలా కుమిలిపోతున్న విద్యానాథుని కిక కాళ్ళాడలేదు. అయినా భీమేశ్వర శర్మను వెంటబెట్టుకుని సోమయామాత్యుని దగ్గిరికి వెళ్ళిపోయాడు. అమాత్యు డతని నెంతో ఆప్యాయంగా గౌరవించాడు. ఎక్కడా చెక్కు చెదర లేదు!

"మీవంటి మహా విద్వాంసులకు మే మేమని మనవి చెయ్యగలం! ఇదిగో మహారాజానుమతితో బేతాళనాయనింగారు స్వయంగా చెక్కించిన తామ్రశాసనం! చిత్తగించండి! దీనిలో తటాకోత్తర ఖండంలో ఉంటున్న పది పుట్ల భూమి మీకు ధారాదత్తం చేసినట్లుంది. ఇది స్వయంగా మహారాజే వేయించిన తామ్రశాసనం! దీనిలో మా ప్రమేయం ఏమి ఉంది?"

ఆ మాటలతో విద్యానాథునికి తల కొట్టివేసినట్లయింది. కాని ఆ తామ్రశాసనం చూచిన క్షణంలో అతని కేదో స్ఫురించింది. వెంటనే భీమేశ్వరశర్మను వెంటబెట్టుకొని తటాకానికి దక్షిణంగా ఉన్న భూభాగంలోనికి వెళ్ళి అక్కడి పాలి కాపులతో ఆ భాగంలో పదిపుట్ల భూమి మహారాజు స్వయంగా తనకు ధారాదత్తం చేశారనీ, ఇక వారంతా తనకే పాలికాపులుగా వ్యవహరించాలనీ ఆజ్ఞాపించాడు.

వారంతా మహారాజు సత్కార కథ విన్నారు. అందుచేత వెంటనే సరేనని అంగీకరించారు. ఆ విషయం చల్లచల్లగా సోమయామాత్యుని చెవిలో పడింది.

అది వినీవినగానే అతడు విద్యానాథుని దగ్గిరికి వచ్చాడు. లేని దురహంకారం తెచ్చిపెట్టుకుని విద్యానాథుణ్ణి బెదిరించాడు :

"మీకు ధారాదత్తం చేసినది ఉత్తరఖండంగాని దక్షిణఖండం కానేకాదు! మీరు చేసింది కేవలం దురాక్రమణం! వెంటనే అక్కడి నించి తొలగకపోతే ఈ వ్యవహారం యావత్తూ మళ్ళీ మహారాజులుంగారి దాకా వెళ్ళిపోతుంది, జాగ్రత్త!"

విద్యానాథుడు మండిపడ్డాడు :

"నీ దిక్కున్నచోట చెప్పుకో! నేను చేసింది దురాక్రమణం కానేకాదు! నీవు చేసిన ద్రోహానికి సరీగా తగినశాస్తి. తెలిసిందా?"

"ఏమయ్యోయ్! నా మాట విను! ఇది ధర్మంకాదు. అనవసరంగా ఆపద పాలైపోతావు సుమా!"

"పో పో! ఇంతాచేసి ఇంకా ధర్మపన్నాలు వల్లిస్తున్నావా? ఇంకా ధర్మపన్నాలేకరువు పెడుతున్నావా?"

అని విద్యానాథుడతన్ని కసిరికొట్టేశాడు. సోమయామాత్యునికి కావలసింది అదే! వెంటనే ఆ వ్యవహారం అంతా మహారాజు వెంటనున్న బేతాళనాయని వరకూ వెళ్ళిపోయింది. నాయడది చల్లగా మహారాజు చెవిలో వేశాడు.

5

విశ్వేశ్వరాగ్రహారం అంతా విద్యానాథునికీ సోమయామాత్యునికీ మధ్య చెలరేగిన వివాదంతో అట్టుడికిపోయిన ట్టుడికిపోయింది. అగ్రహారంలోనివారంతా ఏకగ్రీవంగా విద్యానాథునిదే తప్పన్నారు. అమాత్యునికీ తనకూ పడకపోతే ఆ పగ మరొకవిధంగా సాధించుకోవాలిగాని అలా దురాక్రమణం చెయ్యడం చాలా తప్పని ఖండించారు.

ప్రతాపరుద్ర మహారాజు మృగయా వినోదం ముగించుకొని తిరిగి వస్తూ మళ్ళీ విశ్వేశ్వరాగ్రహారంలో విడిది చేశాడు. ప్రత్యేకంగా విద్యానాథ సోమయామాత్యుల వివాదం పరిష్కరించడానికని అక్కడ తన ఉనికి ఇంకొక్కరోజు పొడిగించాడు.

స్కంధావారంలోనూ, ఆ పరిసరాలలోనూ అగ్రహారీకులంతా కిటకిట లాడిపోయారు. వివాదపరిశీలన ప్రారంభానికి ముందుగా బేతాళ

నాయడు సవినయంగా లేచి నిలబడి వ్యవహారం సంగ్రహంగా విశద పరిచాడు.

"మహారాజా! తమరు విద్యానాథ విద్వాంసుల కిప్పించిన భూభాగం విషయంలో పెద్ద వివాదం బయలుదేరింది. తాము దయ చేయించిన తామ్రశాసనంలో తటాకోత్తర భూభాగం అని స్పష్టంగా ఉల్లేఖింపబడి ఉంది. అయితే విద్యానాథులు దానికి వ్యతిరేకంగా తటాకానికి దక్షిణ భూ భాగంలో పదిపుట్ల భూమి ఆక్రమించుకొన్నారు. 'తటాకోత్తర ఖండ' మని స్వయంగా తమరు వాచాకూడా సెలవిచ్చారు. కాని చివరికి జరిగినదిది. ఆ పైన తమ చిత్తం."

మహారాజు దృష్టి విద్యానాథునివైపు తిరిగింది. విద్యానాథుడు విన్నవించుకొన్నాడు: "నేను అక్షరాలా తమరు దయచేయించిన తామ్ర శాసనం ప్రకారమే నడుచుకొన్నాను. దీనిలో నేను చేసిన దురాక్రమణం ఏమీ లేదు!"

దానిమీద బేతాళనాయకు డడిగాడు:

"తాము దక్షిణభాగం ఆక్రమించుకొన్నమాట నిజమే కదా?"

"అవును! నిజమే!"

"అయితే 'తటాకోత్తర భూభాగం' అంటే 'దక్షిణ భాగం' ఎలా అవుతుంది?"

విద్యానాథు డొక్క నవ్వు నవ్వాడు:

"తటాకం ఉత్తరంగా కలిగిన భూభాగం అంటే దక్షిణ భాగం కాదా? నా మాటమీద నమ్మిక లేకపోతే విద్వాంసుల నెవరినైనా అడిగి చూడండి!"

ఆ సమాధానంతో స్కంధావారంలో అంతటా ప్రశంసలూ, సాధువాదాలూ చెలరేగాయి. సోమయామాత్యుడు షష్ఠీతత్పురుష సమాసం ప్రకారం తటాకమునకు 'ఉత్తరమైన' అని అర్థం చేసు కున్నాడు. అయితే దానికి విద్యానాథుడు 'తటాకము ఉత్తరంగా కలిగిన' అని బహువ్రీహి సమాసం ప్రకారం అర్థం చెప్పాడు. ఆ అర్థంతో ఉత్తర దక్షిణాలు తారుమారై ఉత్తరం దక్షిణంగా మారిపోయింది! ఆ

అర్థం కాదనడాని కిక ఎవరికి గుండెలున్నాయి? ఆ నిర్వచనం వినగానే సోమయామాత్యుని గుండె దిగజారిపోయింది. ముచ్చెమటలు పోశాయి. మహారాజు విద్యానాథుని వాక్చమత్కృతికీ, చాకచక్యానికీ ఎంతో ఆనందించాడు :

“అయితే తామది ‘బహువ్రీహి’ చేశారన్నమాట! అంతేనా?”

అని ఎంతో ఆప్యాయంగా అడిగాడు.

“తమవంటివారు నా వంటి వాడికి బహూకరించిన భూ భాగం ‘బహువ్రీహి’ కాక ‘అల్పవ్రీహి’ అవుతుందా? తాము నాకు సస్యశ్యామలమైన సుక్షేత్ర ఖండిక బహూకరించాలని సంకల్పించారు. సోమయామాత్యులు పట్టి చవిటి నేల ఇప్పించాలని కుట్ర పన్నారు. కాని తమ సత్సంకల్పం ప్రకారం తామిచ్చిన నేల ‘బహువ్రీహి’ అయింది గాని ‘అల్పవ్రీహి’ కాలేదు.”

‘వ్రీహి’ అంటే ధాన్యమని అర్థం. బహు వ్రీహి అంటే బాగా ధాన్యం పండే నేల అనికూడా అర్థం చెప్పవచ్చును. ఆ పదంమీద విద్యానాథుని వ్యాఖ్యానం వినగానే మహారాజూ, సభాస్తారులూ మళ్ళీ మహాశ్చర్యంతో నిశ్చేష్టులైపోయారు.

కాని సోమయామాత్యుడూ, బేతాళనాయుడూ వంచిన తలలిక పైకెత్తలేకపోయారు.

“విద్యానాథ విద్వాంసులీక్షణం నుంచీ మా త్రిలింగ సామ్రాజ్యాస్థాన విద్యాధికారులు!” అన్నాడు ప్రతాపరుద్రమహీపతి!

ఉత్తర క్షణంలోనే విద్యానాథుడు ముక్తకంఠంతో తన ప్రశస్తి శ్లోకం మళ్ళీ ఉచ్చైస్స్వనంతో పఠించాడు :

“నవ లక్ష ధను ర్ధరాధినాథే
పృథివీం శాసతి వీర రుద్రదేవే,
అభవ త్పర మగ్రహార పీడా
కుచకుంభేషు కురంగ లోచనానామ్”

వెంటనే స్కంధావారంలో అంతటా ప్రశంసాపరంపర లొక్కమారుగా మిన్నందుకొన్నాయి!